చెరువు గర్భాలు కబ్జా!

- తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- అధికారుల పర్యవేక్షణ కరువు

ఇచ్ఛాపురం:

చెరువు గర్భాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని చెరువులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో విలువైన చెరువు గర్భాలు మాయమైపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారు. పురపాలకసంఘం పరిధిలోని సుమారు ఎనిమిది ఎకరాల సయ్యద్‌ఖాన్ చెరువు గతంలో నిండుకుండలా ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. పట్టణ పరిధిలో మంచినీటి కుళాయిలు, బోర్లు వేసినప్పటికీ వేసవిలో నీటి సమస్యలు ఎక్కువగా ఉండేవి. దీంతో నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడేవారు. ఆటువంటి పరిస్థితిలో ఐదు వార్డులకు చెందిన ప్రజలకు ఈ చెరువు ఆసరాగా నిలిచేది. ఈ చెరువు సమీపంలోని బావుల నుంచి తాగేందుకు కూడా ఇదే నీటిని స్థానికులు తీసుకొని వెళ్లేవారు. ఇటువంటి చెరువుపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కరువైంది. చెరువు గర్భం నిండా పిచ్చిమొక్కలు, గట్టుపై ముళ్లపొదలు, తుప్పలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. దీంతో చెరువులో చేరే నీటిస్థాయి తగ్గుతూ వచ్చింది. ఇదే అదునుగా చేసుకొని చెరువు గర్భంపై కబ్జాదారుల కన్నుపడింది. ఆ దిశగా ఆక్రమణలు చేసుకొనేందుకు ముందుగా కొంత స్థలాన్ని చదును చేసి అందులో వారి స్వంత ప్రయోజనాలకు వినియోగించుకునేవారు. తరువాత కొద్ది రోజుల్లోనే ఆ స్థలం తనదంటూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇటీవల నాలుగు నెలల కాలంలో ఈ పరిస్థితి ఎక్కువగా కనబడుతుంది. అలాగే బెల్లుపడ ఎల్లమ్మ గుడి రోడ్డులోని 25 ఎకరాల విస్తీర్ణం గల కోటేరు బందపై కూడా అధికారుల పర్యవేక్షణలేదు. దీంతో సుమారు 200 ఎకరాల పంటభూములకు సాగు నీరు కరువైంది. అంతేకాక ఈ చెరువును నమ్ముకొని మత్స్యకారులు చేపలపెంపకం చేసుకొని జీవనం సాగించేవారు. ఈ చెరువులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణలు పెరిగాయి. పట్టణంలోని మరికొన్ని చెరువుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకుందని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ సంబంధిత అధికారులు చెరువు గర్భాలు ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేకశ్రద్ధ చూపడంతోపాటు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


సయ్యద్‌ఖాన్ చెరువు గట్టుపై ఆక్రమణదారులు చదును చేసిన స్థలం


అభివృద్ధి లేక పిచ్చిమొక్కలతో నిండిన సయ్యద్‌ఖాన్ చెరువు


సయ్యద్‌ఖాన్ చెరువు గర్భంలో అనాధికారంగా వేసిన కంచె

చెరువులను పరిరక్షించాలి



ఇచ్ఛాపురం పట్టణంలోని సయ్యద్‌ఖాన్ చెరువుపై అధికారులు ప్రత్యేక చొరవచూపి పరిరక్షించాలి. గతంలో ఈ చెరువు ఎంతోమందిని ఆదుకుంది. చెరువు గర్భంలో పెరిగిన పిచ్చిమొక్కలను, పూడికను తొలగించి అభివృద్ధి చేయాలి. చెరువుల చుట్టూ జరుగుతున్న ఆక్రమణలను అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–బర్ల లక్ష్మణరావు,
ఉప్పలవీధి, ఇచ్ఛాపురం

సొంతంగా బాగు చేసుకుంటాం



చెరువులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తీయాలని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి ఫలితం లేదు. దీంతో 7, 8 వార్డులకు చెందిన యువత అంతా కలిసి స్వయంగా డబ్బులు వేసుకొని శ్రమదానం చేస్తూ సయ్యద్‌ఖాన్ చెరువుని బాగు చేసుకుంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవతీసుకొని ఈ చెరువుని బాగుచేయాలి.

–ఎన్.సోమేశ్వరరావు,
ఏడో వార్డు, ఇచ్ఛాపురం

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం



15వ ఆర్థికసంఘం నిధులు రూ. పది లక్షలతో సయ్యద్‌ఖాన్ చెరువుని బాగు చేయడానికి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చాం. అలాగే అమృత్‌భారత్–2 ద్వారా కోటేరుబంద కూడా అభివృద్ధి చేయడానికి ఉత్తర్వులు ఇచ్చాం. చెరువుల అభివృద్ధి చేసే క్రమంలో ఆక్రమణలుంటే వాటిని నిబంధనలను అనుసరించి తొలగిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

–ఎన్.రమేష్,
మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

క్లుప్తంగా

నేడు, రేపు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు శిక్షణ

కవిటి: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాల మేరకు తొమ్మిది అంశాలపై సమగ్ర అవగాహన కల్పన లక్ష్యంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఈఓపీఆర్‌అండ్‌ఆర్డీ శివాజీపాణిగ్రాహి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో కవిటి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించనున్నట్టు ఆదివారం తెలిపారు.

ప్రభుత్వ విప్‌కు సత్కారం


అశోక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బి.అశోక్‌ను కవిటి గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు ఆదివారం దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. తమ సామాజిక వర్గం అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పొల్లాయి లక్ష్మణమూర్తి కోరారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

షేక్ షాబ్జీకి ఘన నివాళి


షేక్ షాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు


టెక్కలి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ ఆశయాలను కొనసాగించాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. ఆదివారం టెక్కలిలో దివంగత షేక్ షాబ్జీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.శ్రీరామ్మూర్తి, కె.దాలయ్య, టి.వైకుంఠరావు, కుమారస్వామి, పాపారావు, నారాయణరావు, లక్ష్మణరావు, జేవీవీ నాయకులు జి.గిరిధర్, పి.ధర్మారావు, కె.కామేశ్వరరావు, రాంబాబు, తాతయ్య మాస్టార్, ఆర్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్కేటింగ్ క్లబ్ ఏర్పాటు


స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సోంపేట: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతాయని స్కేటింగ్ శిక్షకులు బి.చంద్రావతి, గోపాల్ అన్నారు. స్థానిక తిరుమల థియేటర్ ఆవరణలో అంతర్జాతీయ ఐస్ స్కేటింగ్ దినోత్సవం సందర్భంగా, ధ్యాన్ చంద్ స్పీడ్ స్కేటర్స్ క్లబ్ సోంపేట వారి ఆధ్వర్యంలో స్కేటర్ క్లబ్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోంపేట, పలాసకు చెందిన క్రీడాకారులకు స్కేటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బీన ఈశ్వరరావు, లోయ రాజేష్ పాల్గొన్నారు

ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందజేత


పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంఘ ప్రతినిధులు

సోంపేట: పాఠశాల స్థాయి విద్యలో పదవ తరగతి కీలకమని శ్రీశయన చైతన్య దీపిక ప్రతినిధులు అన్నారు. శ్రీశయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో నింబాషిణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో టెన్త్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ తుంగాన వెంకటేశం మాట్లాడుతూ.. పరీక్షల్లో ప్రతిభ సాధించేందుకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు ఉపయోగపడుతాయన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి భవిష్యత్ బాటలు వేసుకోవాలని సూచించారు. 160 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు, బీన ఆనందరావు, బల్ల జానకీరావు, బంజు లోకనాథం, బల్ల బాబూరావు, తడక మాధవరావు ఉన్నారు.

తులసమ్మకు ప్రత్యేక పూజలు


తులసమ్మ సంబరంలో కాళికా నృత్యం

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో అమ్మవారి ఎదుట మొక్కుబడులు తీర్చుకున్నారు. మేళతాళాలు, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు, కాళీమాత వేషధారణలో నిర్వహించిన సంబరాలు అంబరాన్ని తాకాయి.

ఆర్థిక సాయం



కవిటి మండలం జి.కరాపాడుకు చెందిన నర్తు జగ్గారావు అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతనిది నిరుపేద కుటుంబం కావడంతో చికిత్సకు ఆర్థిక పరిస్థితి సహకరించలేదు. ఈ విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న అబ్దుల్‌కలాం ఫౌండేషన్ సభ్యులు 20 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడుకి ఆదివారం అందజేసి అండగా నిలిచారు.

–కవిటి

కళాకారులకు సన్మానం



పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన జెస్సీ ఈవెంట్స్ కళాకారులకు ఇస్కఫ్ విశాఖ సమితి రాష్ట్ర జానపద సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పడహారి మెమెంటో ఇచ్చి సత్కరించారు. విశాఖపట్నంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొని తమ సత్తాచాటారు. కార్యక్రమంలో జానపద సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్, అధ్యక్షులు ఎల్.ఆర్.కృష్ణబాబు, జెస్సీ ఈవెంట్స్ కిక్కర డిల్లీరావు పాల్గొన్నారు.

–పలాస

బంగారం వితరణ



మండల కేంద్రం కంచిలిలో వెలసిన కంచమ్మ తల్లి అమ్మవారికి రూపొందిస్తున్న బంగారు జడపాలి కోసం అదే గ్రామానికి చెందిన ఒక కుటుంబం అర తులం బంగారాన్ని తమవంతు వితరణగా ఇచ్చారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ కొంచాడ అప్పలరాజు పార్వతి దంపతుల కుమారుడు కిరణ్‌కుమార్–పూర్ణిమ దంపతులు విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు.

–కంచిలి

దుప్పట్లు పంపిణీ



ఇచ్ఛాపురం పట్టణ పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామారావు ఔదార్యాన్ని చాటుకున్నారు. లొద్దపుట్టిలోని ధనరాజుల తులసమ్మ ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న యాచకులు, పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఏటా చలి కాలంలో పేదలకు దుప్పట్లు, వర్షాకాలంలో గొడుగులు అందించడం రామారావు చేస్తుంటారు. ఆయన సేవాభావాన్ని పలువురు అభినందించారు.

–ఇచ్ఛాపురం రూరల్

కొండమ్మతల్లికి పూజలు


కొండమ్మతల్లిని దర్శించుకున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: కొండమ్మతల్లి చల్లని దీవెనలు అందరికీ ఇవ్వాల మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు. పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలోని 19వవార్డు సూదికొండపై ఉన్న కొండమ్మ తల్లి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక కౌన్సిలర్ శిష్టు బృందావతి, అధికార ప్రతినిధి శిష్టు గోపి ఆహ్వానం మేరకు విచ్చేసిన అప్పలరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన, భక్తి భావం పెంపొందిస్తే వాటి ఫలాలు సమాజానికి ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బడగల బల్లయ్య, బల్ల శ్రీనివాస్, బమ్మిడి సంతోష్, సనపల సింహాచలం, అంబటి ఆనంద్, వల్లభ వైకుంఠరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


అక్రమణ తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధి మూడో వార్డు పద్మనాభపురం సచివాలయం, పాతజాతీయ రహదారిలో జీడి పరిశ్రమల ఎదురుగా రోడ్డు పక్కనున్న వరద కాలువల అక్రమణలను అధికారులు తొలగించారు. కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కాలువలను అక్రమించినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, ఆర్ఐ ఖగేశ్వరరావు, ఇతర రెవెన్యూ అధికారులతో కలిసి ఆదివారం తొలగించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ అనుమతితో పాలకమండలిలో చర్చించి పట్టణంలో ఉన్న మున్సిపల్ భూములను, ఖాళీ స్థలాలను టౌన్ సర్వే, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించి సరిహద్దులను గుర్తించి తగు రక్షణ చర్యలను చేపట్టాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఆర్ఐ ఖగేశ్వరరావు ఉన్నారు.

అలరించిన పాడుతా తీయగా పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు యశోద తదితరులు

సోంపేట: పలాసపురం గ్రామంలో శ్రీశయన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దత్తాత్రేయ స్వామివారి 70వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి పాడుతా తీయగా పోటీలు శ్రోతలను అలరించాయి.విజేతలుగా ప్రథమ స్థానంలో బి.శ్రీధర్, మణికంఠ, ద్వితీయ స్థానంలో టి.వరలక్ష్మి, పూజా సాహు, తృతీయ స్థానంలో చక్రవర్తి, కె.జీవన్ నిలిచారు. విజేలకు జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దేవాడ దుర్యోధన, సంఘ ప్రతినిధులు దుద్ది ధర్మారావు, దూగాన జీవనమూర్తి, దుద్ది కోదండరావు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు పొట్టి శ్రీరాములు


టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పేరాడ తిలక్

టెక్కలి: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రతిఒక్కరికీ ఆదర్శనీయులని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే టెక్కలి శాఖ గ్రంథాలయంలో కూడా శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.


టెక్కలి: గ్రంథాలయంలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాముల వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిల్ సభ్యులు అమరజీవి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కాశీబుగ్గ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని జరుపుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అమరజీవి చిత్రపటానికి నివాళులర్పించారు


కాశీబుగ్గ: శ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేస్తున్న కమిషనర్ రామారావు

పొట్టి శ్రీరాములను స్మరించుకుంటున్నాం

కాశీబుగ్గ: ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించారని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస లోని తన కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీరాములు ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఆయనను ఎప్పుడు ప్రజలు స్మరించుకుంటూనే ఉంటారన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఒకే వేదికపై ఏడో తరగతి పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని పెంటవీధి ఎంపీపీ పాఠశాలకు చెందిన 1999–2000 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. 25 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై కలుసుకున్న వీరంతా పిల్లాపాపలతో రోజంతా సందడిగా గడిపారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటులో పూర్వ విద్యార్థి, ప్రస్తుత పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కీలకపాత్ర పోషించి అందరినీ ఒక చోటకు తీసుకువచ్చారు. అప్పట్లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు బి.మధుసూదనరావు, లండ మల్లేశ్వరరావు, ఇప్పిలి వెంకటరమణలను సత్కరించుకున్నారు.

మూడు దశాబ్దాల తరువాత ఒకే వేదికపై..



ఒకే వేదికపై పూర్వ విద్యార్థినులు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని బాలికోన్నత పాఠశాలలో 1993–94 విద్యాసంవత్సరంలో పది తరగతి చదివిన పూర్వ విద్యార్థినులు ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు పాఠాలు బోధించిన షణ్ముఖరావు, వేలు, అనురాధ, హేమలత, అన్నపూర్ణమ్మ తదితర ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు మెయిన్ గేట్‌ను వితరణగా అందజేశారు.

ఉత్సాహంగా పిల్లల క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకలకు హాజరైన పిల్లలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఏడోవార్డు చినబడం గ్రామంలోని క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్‌లో పిల్లల క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అధికసంఖ్యలో పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలు రింగ్ గేమ్, బాల్ గేమ్, క్రిస్మస్ పాటలకు డాన్స్, పెర్ఫెక్ట్ షో, మ్యాజిక్ షో ప్రదర్శనలు ఇచ్చారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరూ కలిసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్ క్రిస్మస్ గిఫ్టుల బొమ్మలను పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్ బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్, పాస్టర్ బి.జి.రాజు పాల్గొన్నారు.

రైతు బిడ్డల సత్తా


పి.హేమంత్


సీహెచ్ సోమేష్


ఎస్.రాహుల్

కాశీబుగ్గ: రైతు కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకులు సత్తాచాటి ఉద్యోగాలు దక్కించుకున్నారు. పలాస మండలం పారసాంబ కాలనీకి చెందిన పి.హేమంత్ ఐటీబీపీ కానిస్టేబుల్‌గా, ఇదే మండలం గంగువాడ గ్రామానికి చెందిన సీహెచ్ సోమేష్, ఎస్.రాహుల్ అసోం రైఫిల్‌కు ఎంపికయ్యారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నిర్వహించిన పరీక్ష ఫలితాలు శనివారం రాత్రి విడుదలయ్యాయి. ఉద్యోగాలకు ఎంపికైన యువకులను అధ్యాపకులు మద్దిల జగన్, గ్రామస్తులు అభినందించారు.